



స్వామివారి సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి తదితరులు

కల్యాణం కమనీయం



- రామతీర్థంలో వైభవంగా సీతారాముల పరిణయం
- వేలాది మంది భక్తుల హాజరు
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మంత్రి శ్రీనివాస్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు



పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

నెల్లిమర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. దేవస్థానం వెనుకవైపు ఉన్న వేదికపై వేలాది మంది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఆయన కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మధుపర్కాలు సమర్పించారు. సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రం నుంచి ఈవో సుబ్బారావు తీసుకు వచ్చిన పట్టు వస్త్రాలను మంత్రి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దంపతుల చేతుల మీదుగా సింహాచలం అందజేశారు. అలాగే ఎమ్మెల్సీ బొత్స సత్య నారాయణ, ఝాన్సీలక్ష్మి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాలను వ్యక్తిగతంగా సమర్పించారు. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, పవన్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు తదితర అర్చక బృందం శాస్త్రోకంగా నిర్వహించింది. రామనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు 30 వేల మంది భక్తులు వచ్చారని అంచనా. పలువురు జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు రాములోరి కల్యాణోత్సవాన్ని తిలకించారు. దేవస్థానం ప్రధాన ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, దేవాదాయ శాఖ డీసీ సుజాత, ఏసీ శిరీష, ఆర్డీవో డి.కీర్తి, రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి, శ్రవణ చైతన్య చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు. విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుళ్లసీతారాంపురంలో..

సంతకవిటి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గుళ్లసీతారాంపురంలోని పురాతన సీతారాముల దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో ప్రధాన పూజారి భోగాపురపు ప్రసాద్‌రావు, వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన సీతారా ముల కల్యాణాన్ని కనులారా తిలకించి భక్తజనం పులకరించిపోయారు. మండలం నుంచి కాకుండా రాజాం, రేగిడిచ వంగర. జి.సిగడాం తదితర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు, సర్పంచ్ రావు రవీంద్ర ఏర్పాట్లు చేశారు. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేదపండితులు, నమస్కరిస్తున్న భక్తులు



రామతీర్థంలో కల్యాణం తిలకిస్తున్న జిల్లా ప్రజాప్రతినిధులు, భక్తులు

ఆయుష్మాన్‌భవ



- సరైన జీవనశైలితోనే ఆరోగ్యం
- వ్యాయామం తప్పనిసరి
- ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు అవసరం
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

- విజయనగరంలోని ఓ గ్రామానికి చెందిన రామారావు (45) దినసరి కూలీ. ఈయన గత ఏడేళ్లుగా డయాబెటిక్, బీపీ (రక్తపోటు)తో బాధపడుతున్నాడు. వీటి దుష్ప్రభావాలతో ఆయన ఏ పనిచేయాలన్నా శరీరం సహకరించడం లేదు. మరోపక్క ఔషధాలు కొనలేక ఆర్థికంగా చితికిపోయాడు.
- విజయనగరంలోని ఓ ప్రముఖ ప్రైవేటు కంపెనీలో పని చేసే ఓ వ్యక్తి ఒత్తిడితో డిప్రెషన్‌కు లోనయ్యాడు. చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కన్పించడంలేదు.

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 6

ప్రస్తుతం మారుతున్న జీవన విధానం, మత్తుపదార్థాల వినియోగం, పని ఒత్తిడి, నిద్రలేమి కారణాలతో రోగాలు చుట్టు ముడుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా మెడ, నడుము, మోకాళ్ల సమస్యలు, డయాబెటిక్, థైరాయిడ్, బీపీ, గుండె, కిడ్నీ, కాలేయం, మానసిక సమస్యలతో ఎక్కువమంది ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఇందులో ఎక్కువ శాతం మంది జీవనశైలి విధానం వల్లే రోగాలు కొని తెచ్చుకుంటున్నా రని వైద్య నిపుణులు అంటున్నారు. సరైన ఆహార నియామాలు, తగినంత వ్యాయామం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని సూచిస్తున్నారు. అందుకే ప్రతి ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకొంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తుంది.

ఇలా చేస్తే మేలు..

జీవనశైలి మార్పులతో ప్రస్తుం మధుమేహం, రక్తపోటు వ్యాధులు నమోదు కావడం సర్వసాధారణమైపోయాయి. వీటి దుష్ప్రభావాలతో గుండెపోటు, పెరాలసిస్, బ్రెయిన్ స్ట్రోక్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కొంతవరకైనా జీవనశైలిలో మార్పులతో రోగాలను నియంత్రించ వచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవాలి. బాదం, జీడిపప్పు, అవిసె గింజలు, చియా, పొద్దుతిరుగుడు, గుమ్మడి, పుచ్చకాయ, బొప్పాయి, మొక్కజొన్న (మిగతా 8వ పేజీలో..)

శారీరక శ్రమతోనే ఆరోగ్యం..

శారీరక శ్రమ కలిగినప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడు. అందుకే శారీరక వ్యాయామం తప్పనిసరి. జంక్‌ఫుడ్స్, వేపుళ్లు తినడం తగ్గించాలి. ఉప్పు, పంచదారను మితంగా తీసుకోవాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచి ఆరోగ్య జీవన విధానాన్ని అలవాటు చేయించాలి. అప్పుడే వారు పెద్దయ్యాక కూడా ఎటువంటి రోగాలు లేకుండా జీవించగలుగుతారు. ఫైబర్ కలిగిన ఆహారం, తాజా ఆకుకూరలు, పండ్లు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవాలి. మత్తుపదార్థాలను మానివేయాలి. పని ఒత్తిడి తగ్గించుకోవడానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కొంతసేపైనా ఆనందంగా గడపడానికి ప్రయత్నించాలి.

-డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయనగరం

ఆయుర్వేదంతో అనారోగ్య సమస్యలు దూరం



ఆయుర్వేదం ప్రపంచంలోనే అత్యంత పురాతన మైనది. ప్రాచీనమైనది. ఆయుర్వేదం ద్వారా రోగాలను చాలా వరకూ తగ్గించవచ్చును. అన్ని రకాల మొండి వ్యాధులతో పాటు మధుమేహం, బీపీకి కూడా ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చును. తమ శరీర తత్వానికి అనుగుణంగా ఆహారాన్ని ఎంపిక చేసుకోవాలి.

-డాక్టర్ ఎం.ఆనందరావు, సీనియర్ వైద్య నిపుణులు, ఆయుష్‌శాఖ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయనగరం

సోదరుడి స్నేహితుడే నిందితుడు

- అఖిలపై హత్యాయత్నం కేసును ఛేదించిన పోలీసులు
- యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గరివిడి మండలం శివారం గ్రామంలో కోండ్రు అఖిల అనే యువతిపై శనివారం జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. అఖిల సోదరుడి స్నేహితుడే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తన వ్యవహారాన్ని గ్రామస్థులకు చెబుతుందని అదే గ్రామానికి చెందిన బురిడి ఆదినారాయణ అనే యువకుడు అఖిలను కత్తితో పొడిచి చంపేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. అఖిల సోదరుడికి ఆదినారాయణ స్నేహితుడు. దీంతో ఆదినారాయణ తరచూ అఖిల ఇంటికి వెళ్తుండేవాడు. ఆమెను చెల్లిగా పిలిచేవాడు. ఇటీవల అఖిల తరచూ ఎవరితో ఫోన్లో మాట్లాడుతుండడంతో ఆదినారాయణ అనుమానం పెంచుకున్నాడు. అలాగే ఆదినారాయణ విజయవాడలో ఉంటున్న ఒక మహిళకు అసభ్యకరమైన సందేశాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంపినట్టుగా అఖిలకు తెలిసింది. తన వ్యవహారాన్ని అఖిల గ్రామస్థులకు చెబుతున్నట్లు ఆదినారాయణ భావించాడు. ఈ విషయంలో ఆమెను చంపేస్తానని గతంలో అఖిలను బెదిరించాడు. ఈ నేపథ్యంలో శనివారం ఆమె ఇంటికి వెళ్లి దాక్కున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంకీ క్యాప్ ధరించి అఖిలను చంపేందుకు కత్తితో దాడి చేశాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ సమయంలో సంఘటనా స్థలం వద్ద (మిగతా 8వ పేజీలో..)

ఉత్కంఠ

- బొబ్బిలి మునిసిపాల్టీలో క్యాంపు శిబిరాలు
- కౌన్సిలర్లు చేజారిపోకుండా పార్టీల వ్యూహాలు
- అసమ్మతి శిబిరానికి మళ్లీ తిరిగి వచ్చిన మహిళా కౌన్సిలర్

బొబ్బిలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావుకు సంబంధించి అవిశ్వాస తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ నేడో, రేపో ఫారమ్-2 నోటీసును జారీ చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. ఈలోగా అనేక రాజకీయ వ్యూహాలు, ప్రతివ్యూహాలు తెరమీదకి వస్తున్నాయి. చైర్మన్‌పై అసమ్మతిని తెలియజేస్తూ పదిమంది వైసీపీ కౌన్సిలర్లు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా తెలియజేసిన విషయం తెలిసిందే. ఆ పదిమంది ఓ రహస్య శిబిరంలో ఉన్నారు. వారిలో ఓ మహిళా కౌన్సిలర్ తన ఇంటికి వచ్చేయడంతో అసమ్మతి కౌన్సిలర్ల శిబిరంతో పాటు టీడీపీ శిబిరంలోనూ కాసింత కలవరం మొదలైంది. యుద్ధప్రాతిపదికన పావులు కదిపారు. అధినాయకుల ఆదేశాలతో సంప్రదింపులు జరిపారు. దీంతో మహిళా కౌన్సిలర్ మళ్లీ అసమ్మతి వైసీపీ కౌన్సిలర్ల రహస్య శిబిరంలో చేరినట్టు విశ్వసనీయంగా తెలిసింది. తాజా పరిణామంతో తొలుత సంబరపడిన వైసీపీ శిబిరం తమ వంతు వ్యూహాలకు పదును పెట్టింది. తమ వర్గంలో ప్రస్తుతం ఉన్న పదిమందిని కాపాడుకుంటూనే మరికొంతమంది అసమ్మతి కౌన్సిలర్లను తమ వైపు తీసుకొచ్చేందుకు అన్ని రకాల మార్గాల్లో ప్రయత్నాలను ముమ్మరం చేశారు. దీనిని సమర్థవంతంగా తిప్పికొటేందుకు అధికార తెలుగుదేశం పార్టీ (మిగతా 8వ పేజీలో..)

ఉడకని అన్నం.. పాచిపోయిన కూర

- నచ్చితే తిను.. లేదంటే మానేయ్
- రోగులకు అందని నాణ్యమైన ఆహారం
- బయట హోటళ్లలో కొనుగోలు చేస్తున్న వైనం
- ఇదీ జిల్లాలోని ఆస్పత్రుల్లో అందిస్తున్న భోజనాల పరిస్థితి

ఆంధ్రజ్యోతి విజిట్

విజయనగరం/మెంటాడ/శృంగవరపుకోట రూరల్/బొబ్బిలి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో భాగంగా రోగులకు అందిస్తున్న ఆహారం నాసిరకంగా ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'మాకు నచ్చింది పెడతాం. నచ్చితే తిను..లేదంటే నోరుమూసుకొని ఉండు' అన్నట్టుగా జిల్లాలో పరిస్థితి ఉంది. ఆకలిని తాళలేక, బయట హోటళ్లలో కొనుగోలు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక, గత్యంతరంలేని స్థితిలో చాలామంది రోగులు తింటున్నారు. కచ్చితంగా మెనూ అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా చాలా ఆస్పత్రుల్లో అమలు కావడం లేదు. జిల్లాలోని పలు ఆస్పత్రులను శనివారం, ఆదివారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.



గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో ఉప్మాను చెత్తబుట్టలో పడేసిన దృశ్యం



ఎస్.కోట ఆసుపత్రిలో రోగులకు అందించిన గోలి కాయంత శనగ పప్పుండ, చిన్న అరటిపండు

గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో..

రోగులకు ఆదివారం ఉడికీ ఉడకని అన్నం పెట్టారు. పాచిపోయిన కూర (మితంగా), మంచినీళ్లను తలపించే సాంబారు, చిన్నపాటి గుడ్లు వడ్డించారు. నీళ్ల లాంటి పాలు, నాసిరకం రొట్టెముక్కలు అందించారు. వడ్డించిన వారుకూడా రోగుల సహాయకులతో అమర్యాదకరంగా ప్రవర్తించడం కనిపించింది. చాలామంది ఆకలిని తట్టుకోలేక, చేతిలో డబ్బులు లేక తప్పనిసరి పరిస్థితుల్లో నాసిరకం భోజనం చేశారు. కొందరు తినలేక మధ్యలోనే పారబోశారు.

బొబ్బిలి సీహెచ్‌సీలో..

బొబ్బిలి ప్రభుత్వ కమ్యూనిటీ (మిగతా 8వ పేజీలో..)



తలంబ్రాల వేడుక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

నిఘా నీడలో రాములోరి కల్యాణం

● పెణసాంలో 120 మందితో బందోబస్తు ● పర్యవేక్షించిన తహసీల్దారు



రాములోరి కల్యాణోత్సవంలో భక్తులతో పాటు పోలీసులు



గ్రామంలో పోలీసుల బందోబస్తు

గంట్యాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెణసాంలో పోలీసు నిఘా నీడలో ఆదివారం రాములోరికి కల్యాణోత్సవం నిర్వహించారు. నవమి వేడుకల నిర్వహణకు ఇరువర్గాల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, దాదాపు 120 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మరోవైపు రెవెన్యూ అధికారులు దీన్ని పర్యవేక్షించారు. కల్యాణోత్సవం ప్రశాంతంగా పూర్తవడంతో ఎట్టకేలకు అధికారులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. నవమి సందర్భంగా గ్రామంలోని రామాలయంలో ప్రథమ పూజ నిర్వహణను రెండు రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఆలయాన్ని నిర్మించామని, కొన్ని దశాబ్దాలుగా ప్రథమ పూజ నిర్వహిస్తున్నామని ఒక వర్గం.. అధికారంలోకి వచ్చామని తమకు అవకాశం ఇవ్వాలని మరో వర్గం పట్టుబట్టిన విషయం అందరికి తెలిసిందే. ఈ వివాదం జిల్లా అధికారులు దృష్టికి వెళ్లింది. వారు ఇరువర్గాలతో పలుమార్లు చర్చలు నిర్వహించారు. చివరికి రెండు వర్గాల నుంచి చెరో ఒక్క దంపతుల ప్రథమ పూజకు ఒప్పించడంతో వివాదానికి చెక్ పడింది. దీంతో గ్రామంలోని సీతారాములకు పోలీసులు సమక్షంలో కల్యాణోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులతో పాటు పోలీసు సిబ్బంది హాజరై బందోబస్తు నిర్వహించారు. మరోవైపు ఆలయం చుట్టూ, గ్రామంలో పోలీసులు పహరా కాశారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరావు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సాయంత్రం సీతారాములను గ్రామంలోని పోలీసుల సమక్షంలో ఊరేగించారు.

అఖిలకు ఎమ్మెల్యేల పరామర్శ

విజయనగరం రూరల్/ రింగురోడ్డు/ గరివిడి ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దాడికి గురై విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన కోండ్రు అఖిలను ఆదివారం ఉదయం చీపురుపల్లి విజయనగరం ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, అదితి గజపతిరాజులు వేర్వేరుగా వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చీపురుపల్లి నియోజకవర్గంలో ఇటువంటి ఘటన జరగడం దురదృష్టకరమని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు.



అఖిలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మెంటాడలో వర్షం



మెంటాడలో కురుస్తున్న వర్షం

మెంటాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. కొన్నాళ్లుగా ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలు ఉపశమనం పొందారు. వర్షాలు లేక ఎండిపోతున్న నువ్వు, రబీ వరి పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు అంటున్నారు.

అశోక్‌ను కలిసిన ఏఎంసీ చైర్మన్



అశోక్‌తో మాట్లాడుతున్న గోపాలరాజు

గజపతినగరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు ఆదివారం బంగ్లాలో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి తనకు ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రితో కలిసి అశోక్‌ను కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. వీరితో పాటు పార్టీ నాయకులు రామ్‌కుమార్, ప్రదీప్ తదితరులున్నారు.

ఎప్పటిలాగే బెదిరించి..

● ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

గరివిడి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎప్పటిలాగే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిద్దామనుకున్నాడు. కానీ కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు విడిచాడు. వివరాల్లోకి వెళితే గరివిడి పట్టణంలోని కొండపాలెం ప్రాంతానికి చెందిన కవ్వాలి బాలరాజు(32) తాగుడుకు బానిసయ్యాడు. భార్య పద్మ, ఇద్దరు పిల్లలతో పాటు పలాస ప్రాంతంలో పెయింటింగ్ పనులు చేస్తున్న జీవనం సాగిస్తున్నాడు. తరచూ భార్యతో గొడవపడుతూ కొండపాలెంలోని తల్లి యశోద ఇంటికి వచ్చేవాడు. నాలుగురో జుల కిందట కొండపాలెం వచ్చిన బాలరాజు తాగడానికి డబ్బులు ఇవ్వమని తల్లిని అడిగాడు. లేవంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. అప్పటికే తాగి ఉండడంతో అతడిని ఎవరు పెద్దగా పట్టించుకోలేదు. దీంతో బెదిరిద్దామని శనివారం రాత్రి సమీప తోటలోకి వెళ్లి ఉరి వేసుకుందామని ప్రయత్నించే క్రమంలో తాడు బిగుసుకుని నిజంగానే మృత్యువాత పడ్డాడు. గరివిడి పోలీసులు కేసు చేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

గరివిడి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో బి.జె.పాలెం గ్రామానికి చెందిన కె.అప్పన్న (62)ను శనివారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తుతెలియని కారు ఢీకొని మృతి చెందాడు. అప్పన్న రాత్రి భోజనం అనంతరం బహిర్భూమికి వెళుతుండగా రాజాం నుంచి చీపురుపల్లి వెళ్తున్న కారు బలంగా ఢీకొనడంతో అప్పన్న మృత్యువాత పడ్డాడు. కుమార్తె సత్తమ్మ ఫిర్యాదు మేరకు గరివిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం పట్టివేత

జామి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం వేర్వేరు చోట్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరజనార్దన్ తెలిపారు. మండలంలోని తెలగపాలెం రొంగలి నాగేశ్వరావు 13 మద్యం సీసాలతో, కుమారాం గ్రామానికి చెందిన చిట్టిబోయిన దేముడు 21 మద్యం సీసాలతో పట్టుబడ్డారన్నారు.

20 లక్షల మొక్కల పెంపకానికి చర్యలు

అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియా పాండే

బొండపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 2025-26 సంవత్సరానికి సంబంధించి 20 లక్షల మొక్కలను వనమిత్ర కేంద్రాలతో పాటు నర్సరీల్లో పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అటవీశాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియా పాండే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వనమిత్ర కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రకాల మొక్కలతోపాటు ప్రత్యేకంగా ఈ ఏడాది పనస మొక్కలను నర్సరీల్లో పెంచి పంపిణీ చేసేందుకు 30 వేల మొక్కలను రాష్ట్రవ్యాప్తంగా పెంచుతున్నట్టు తెలిపారు. బొబ్బిలి వీణల తయారీ కోసం గాను అవసరం అయిన పనస చెట్ల కొరత తీవ్రంగా ఉన్నట్లుగా ప్రభుత్వం దృష్టికి వీణల తయారీదారులు తీసుకువచ్చిన నేపథ్యంలో వాటి పెంపకానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది 50 వేల పనస మొక్కలను నర్సరీల్లో పెంచి పంపిణీ పెంచేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో కొండలరావు, ఎఫ్ఆర్‌వో సింధూ, ఫారెస్టు ఆఫీసర్ బి.అప్పలరాజు, వనమిత్ర కేంద్రం సహాయకులు పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసకు చేరిన ఇస్కాన్ భక్తులు

కొత్తవలస, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సంపూర్ణ భారతదేశ పాదయాత్రలో భాగంగా ఇస్కాన్ భక్తులు శనివారం రాత్రి కొత్తవలస చేరుకున్నారు. ఇస్కాన్ అఖిల భారత పాదయాత్ర అధ్యక్షుడు ప్రభూజీ ఆధ్వర్యంలో సనాతన ధర్మం, వైదికసంప్రదాయం విలువలు ధ్యేయంగా పాదయాత్రను నిర్వహిస్తున్నారు. ద్వారకాలో ప్రారంభమైన పాదయాత్ర కేదారినాథ్, బద్రీనాథ్, అయోధ్య, మాయాపూర్, జగన్నాథపురి, శ్రీకూర్మం, సింహాచలం, మంగళగిరి, తిరుపతి, రామేశ్వరం, కన్యాకుమారి చేరుకుని అక్కడ ముగుస్తుందన్నారు. ఎడ్ల బండి రథంపై శ్రీకష్ణ, బలరాముని విగ్రహాలతో పాటు 18 మంది భక్తులు రోజుకు 10 కిలోమీటర్లు వివిధ గ్రామాల మీదుగా పాదయాత్రసాగిస్తున్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు భద్రబలరామదాస్, ఉత్తమ్‌నరహరిదాస్, సునిర్మల చైతన్యదాస్, ద్వారకాదాస్ పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్నఇస్కాన్ సభ్యులు

ఆహ్వాన క్రికెట్ టోర్నీ ప్రారంభం

గరివిడి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని డీఎఫ్ఎన్ కాలనీలో డీఎఫ్ఎన్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రాధిక మెటల్స్ అండ్ మినరల్స్ గ్రూప్ సంస్థల సౌజన్యంతో ఆహ్వాన స్మారక క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో పలు గ్రామాలకు చెందిన 50 క్రికెట్ జట్లు మూడు వారాల పాటు లీగ్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లలో విజేతలకు ట్రోఫీలు అందజేయనున్నారు. ఇటీవల అకాలంగా మృతిచెందిన చంటి, కరుణ, పుడిరాజుల స్మారక పోటీలను కేసీపీ ట్రోఫీ పేరిట టైటిల్ కప్ ప్రదానం చేయనున్నారు. మైనింగ్ సంస్థ ప్రతినిధి సత్యనారాయణ టాస్ వేసి తొలి మ్యాచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో దువ్వం సర్పంచ్ ప్రతినిధి తోట రవి, ఎంపీటీసీ సభ్యులు నేతేటి కృష్ణవేణి, వి.చిట్టియ్య, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు


విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రేజేటి కరుణాకర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందించారు. రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలు ప్రధాన రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన అమరావతి చిత్రకళావీధిలో రేజేటి ప్రదర్శించిన చిత్రాలను చూసి ప్రశంసించారు. కనుమరుగవుతున్న పల్లె, పల్లె ప్రజల స్థితిగతులను వారి జీవన విధానాన్ని పల్లె పూర్వవైభవాన్ని కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించడంపై వారు అభినందించారు.



మంత్రి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కరుణాకర్

పైప్‌లైన్ లీకు అరికట్టండి

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం కోమటి చెరువు వద్ద తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ వాల్వ్ లీకై తాగునీరు వృధాగా పోతోంది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. లీకును సరిచేసి తాగునీరు వృథా కాకుండా చూడాలని పలువురు కోరారు.



తాగునీరు వృథా అవుతున్న దృశ్యం

భగవద్గీతను పఠించాలి

శృంగవరపుకోట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి భారతీయడు భగవద్గీత పఠించాలని మోక్ష విద్యామందిర్ వ్యవస్థాపకుడు శీలా కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం శృంగవరపుకోట శ్రీనివాస కాలనీ కుసమ హరినాథఆలయం సమీపంలో ప్రతి ఇంటికి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. దారరాజు, శ్రీహరి, గౌతమి తదితరులున్నారు.

మిమ్స్‌లో ఘనంగా నవమి వేడుకలు

నెలిమర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిమ్స్‌లో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. స్వామికి పూజలు నిర్వహించారు.



నవమి ఉత్సవాలకు హాజరైన అశోక్

గౌరినాయుడుకు సత్కారం

లక్కవరపుకోట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన సాహితీవేత్త కిలారి గౌరినాయుడును తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి ఆదివారం రాజమండ్రిలో ఘనంగా సత్కరించింది. ప్రముఖ కవి బోయి భీమన్న జీవితం-సాహిత్యం అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. బోయి భీమన్న రచించిన పాలేరు నాటకం యువతను చదువుకునేలా చేసి ఉన్నత శిఖరాలకు చేర్చిందని గుర్తుచేశారు. అనంతరం ఎమ్మెల్సీ నాగబాబును కలిసి గెస్టు లెక్చరర్ల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో రచయితలు, సాహితీవేత్తలు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న పీజీఆర్ఎస్‌లో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొననున్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారని మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన విడుదల అయింది.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

చీపురుపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజాం, చీపురుపల్లి, గరివిడి, గుర్ల, లక్కవరపుకోట, ఎస్.కోటల్లోని పార్టీ కార్యాలయాల్లో మండల నాయకులు కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. చీపురుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ వర్మ పాల్గొన్నారు.



చీపురుపల్లిలో బైక్ ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు

యువకుడి ఆత్మహత్య

భోగాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కంచేరు సమీపంలో ఎయిర్‌పోర్టు క్వార్టర్స్‌లో బీహార్‌కు చెందిన రాజ్‌కుమార్(25) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ వి.పాపారావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల మేరకు బీహర్‌కు చెందిన రాజ్‌కుమార్ నెలరోజుల క్రితమే ఇక్కడ పని కోసం వచ్చాడు. అయితే నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతుండేవాడు. ఆదివారం ఉదయం పనికి వెళ్లకుండా ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అయితే మధ్యాహ్నం రూమ్ మేట్స్ వచ్చేసరికి చూసే తలుపులు మూసి ఉన్నాయి. కిటికిలో నుంచి చూసేసరికి ఇనుప రాడ్డుకు రాజ్‌కుమార్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో ఫిర్యాదు చేశారన్నారు. అబ్దుస్‌సలామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాయని ఎస్‌ఐ తెలిపారు.

బతుకు తెరువుకు వెళ్లి..

● విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజేష్ (ఫైల్)

జియ్యమ్మవలస, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బతుకుతెరువుకు ఊరు విడిచి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం కుందరతిరువాడ పంచాయతీ నీచుకవలస గ్రామానికి చెందిన పత్తిక రాజేష్(22) అనే యువకుడు బతుకు తెరువు కోసం విశాఖపట్నం వెళ్లాడు. ఇళ్లకు పెయింటింగ్ వేసే పనిలో చేరాడు. ఈక్రమంలో గత నెల 28న గాజువాకలోని ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే ఆ యువకుడిని కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించారు. మృతిచెందిన రాజేష్‌కు తండ్రి పత్తిక శ్రీనివాసరావు, తల్లి సునీత, తమ్ముడు రాకేష్ ఉన్నారు.

ఆటో బోల్తా: మహిళ మృతి

● తొమ్మిది మందికి గాయాలు

సీతంపేట రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలం సోమగండి పంచాయతీ పరిధి అక్కన్నగూడ సమీపంలో ఆదివారం ఎ యంత్రం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో రాజన్నగూడకు చెందిన సవర పెద్ద తిక్కమ్మ(54) మృతి చెందింది. మరో తొమ్మిది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో ఏర్పాటు చేసిన ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు పది మంది కుటుంబ సభ్యులు రాజన్న గూడ నుంచి ఆటోలో బయల్దేరారు. రెండు కిలోమీటర్లు దాటిన తర్వాత అక్కన్నగూడ సమీపంలో అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. దీంతో అక్కడికక్కడే తిక్కమ్మ మృతి చెందింది. కుటుంబ సభ్యులైన సవర ఉషారాణి, స్మిత్, రాశి, సునేమి, రాయమణి, సౌజన్య, సునీత, మీనా, సోహైల్, జీవన్‌లు గాయాలపాలయ్యారు. స్థానికులు వీరిని 108 వాహనంలో సీతంపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. క్షతగాత్రుల్లో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ స్వాధీనం

భోగాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలం చెరకుపల్లి సమీపంలో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్టు వీఆర్వో సంతోష్ తెలిపారు. పోలిపల్లి రెవెన్యూ సమీపంలో కొండ పోరంబోకు సర్వే నెంబరు 183లో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. గ్రావెల్ అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించి సంబంధిత వాహనాలను పోలీసులకు అప్పగించామన్నారు. ఈ విషయమై తహసీల్దారు ఎం.సురేష్‌ను వివరణ కోరగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


గజపతినగరం: బజార్ సెంటర్‌లోని సీతారామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్


విజయనగరం: పాల్‌నగర్‌లో సీతారాముల కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు


లక్కవరపుకోట: ఖాసాపేటలో సీతమ్మవారికి తలంబ్రాలు వేస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి


బొబ్బిలి: పాతబస్టాండ్‌లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు

● కిటకిటలాడిన ఆలయాలు

జిల్లాలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాల వద్ద భక్తులు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు, ఆలయాల సిబ్బంది ఏర్పాట్లుచేశారు. ఉదయం నుంచే భక్తులు పోటెత్తడంతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తుల రద్దీ దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలో చోటుచేసుకోకుండా పోలీసులు బందో బస్తు నిర్వహించారు. ఆలయాలకు వచ్చిన భక్తుల కోసం అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశాయి. - (ఆంధ్రజ్యోతి బృందం)


భోగాపురం: పెద్దవీధి రామాలయంలో..


రాజాం: అమ్మవారి కాలనీలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


కొత్తవలస: మంగళపాలెంలో శ్రీరామనవమి పురస్కరించుకుని 350 రకాల పిండి వంటల నైవేద్యం ఏర్పాటుచేసిన దృశ్యం


నెల్లిమర్ల: రామతీర్థంలోని రామస్వామి వారి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు


బొండపల్లి:కనిమెరకలో సీతారాములను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు


బొబ్బిలి రూరల్: నారాయణప్పవలస రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


శిథిలావస్థకుచేరిన ఆరికతోట పశువైద్యశాల భవనం

వసతి చాలక..వైద్యానికి అగచాట్లు

●శిథిలావస్థలో భవనం ●ఇదీ ఆరికతోట పశువైద్యశాల పరిస్థితి

రామభద్రపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరికతోట పశువైద్యశాల శిథిలావస్థకు చేరడంతో పాడి రైతులు భయాందోళన చెందుతున్నారు. ఆరు గ్రామాలకు చెందిన పాడి రైతులు తమ పశువులను ఇక్కడికే పశువైద్యంకోసం తీసుకొస్తుంటారు. బ్రిటీషుపాలకుల కాలంలో చిన్న చిన్న గదులు నిర్మించడంతో ప్రస్తుతం వసతి సరిపోవడం లేదు.దీంతో వైద్య సేవలకు అగచాట్లు తప్పడం లేదు. ప్రస్తుతం అందుబా టులోఉన్న చిన్న చిన్న గదుల తోనే నెట్టుకొస్తున్నారు.ఈఆసుపత్రిపరిధిలో జగన్నాథపురం, నర్సాపురం, రొంపల్లివలస, నాయుడువలస, దత్తిరాజేరు మండలంలోని చౌదంతివలసలకు చెందిన పాడి రైతులకు సంబంధించిన పశువులకు సేవలందుతున్నాయి. ప్రధానంగా స్టోర్, స్టాఫ్‌రూము, పాడి రైతులకు వెయిటింగ్ హాలు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. పశువైద్య కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని దశాబ్దాల కాలంగా జిల్లా పశువైద్యాధికారికి విన్నవించినా ఫలితంలేకపోతోందని ఆరికతోటకు చెందిన పాడి రైతులు కూనిశెట్టి భాస్కరరావు, కిర్లనూకంనాయుడు తదితరులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వందలాది పశువులు వైద్యానికి తీసుకువస్తున్నా, కనీససౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని వాపోయారు. కాగా ఆసుపత్రి భవనాల నిర్మాణానికి ప్రతిపాదన పంపించామని పశువైద్యాధికారి సురేష్ తెలిపారు.


చెట్టుకు పూజలు చేసిన తర్వాత నరుకుతున్న దృశ్యం


కృష్ణాపురం నుంచి సిరిమానును తరలిస్తున్న భక్తులు

దాడితల్లి అమ్మవారి సిరిమాను తరలింపు

బొబ్బిలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారికి సంబంధించిన సిరిమాను చెట్టును ఆదివారం ఉదయం కృష్ణాపురం నుంచి భక్తిశ్రద్ధలతో గొల్లపల్లి గ్రామానికి మేళతాళాలతో ఊరేగింపుగా తరలించారు. బొబ్బిలిలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్న విషయం విదితమే. ఈమేరకు ఇందుకు అవసరమైన సిరిమాను చెట్టుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు మండల జనార్దనరావు, వజ్జి రవికుమార్, సర్వసిద్ది సాయిహేమంత్‌ల ఆధ్వర్యంలో గ్రామస్థులు కృష్ణాపురం వెళ్లి పూజలు నిర్వహించారు.అదే గ్రామానికి చెందిన మునిసిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తొలిగొడ్డలి వేటు వేశారు. 12 గ్రామాలకు చెందిన ఇలవేల్పుగా ఉన్న దాడితల్లి అమ్మవారి పండుగను ఏటా నిర్వహిస్తున్న విషయం విదితమే. కృష్ణాపురంలో గుర్తించిన సిరిమాను చెట్టును ఆదివారం నరికి గ్రామానికి తరలించేందుకు మేళతాళాలతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ

(ఐదో పేజీ తరువాయి)

గింజలను ఆహారంగా తీసుకోవాలి. వీటి వల్ల గుండెజబ్బులు, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చును. పండ్లు, కూరగాయలు శరీర పని తీరును మెరుగుపరిచేందుకు సాయపడతాయి. వీటితో ఆరోగ్యానికి అవసరమైన విటమిన్‌లు ఫైబర్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువును అదుపులో ఉంచుకోవచ్చు. బ్రౌన్ రైస్, కినోవా, ఓట్‌మిల్స్ వంటి తృణధాన్యాల్లో ఫైబర్, ప్రొటీన్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి బ్లడ్ షుగర్‌ను నియంత్రించడంలో, దీర్ఘకాలిక వ్యాధులు నివారించడంలో ఎంతగానో సాయపడతాయి. శారీరక శ్రమతో బరువును అదుపులో ఉంచుకోవచ్చు. ప్రతిరోజూ వ్యాయామం వల్ల గుండె, ఇతర వ్యవస్థలు బలోపేతం అవుతాయి. శారీరక, మానసిక ఆరోగ్యానికి 8 గంటలు నిద్రపోవడం అవసరం.

రెచ్చిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు

● రోజుల వ్యవధిలోని ఏడుచోట్ల చోరీలు
● వాటి విలువ రూ.18 లక్షలు

కొత్తవలస, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు రెచ్చి పోతున్నారు. వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా శనివారం రాత్రి దేశపాత్రునిపాలెం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేశారు. మండలంలో గత కొద్ది రోజుల వ్యవధిలోనే 7 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గుయ్యాయి. వీటి విలువ సుమారు రూ.18 లక్షల వరకు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. చినరావుపల్లి, కంటకాపల్లి, పెదరావుపల్లి, కాటకాపల్లి, అప్పన్నదొరపాలెం, దేశపాత్రునిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్టు ఆ గ్రామాల సర్పంచ్‌లు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామాలకు సంబంధించి రోడ్డుపక్కన ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల లక్ష్యంగా చోరీ చేస్తున్నట్టు విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. దొంగలు సులభంగా విద్యుత్ కనెక్షన్ తప్పించి, ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును వేరు చేసి పట్టుకెళ్లిపోతున్నారని చెబుతున్నారు. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.2.50లక్షలు ఉంటుందని అంటున్నారు. కొత్తవలస మండలంలోనే కాకుండా జామి, వేపాడ, లక్కవరపుకోట మండలాల్లో కూడా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరిగినట్టు తమకు సమాచారం వచ్చిందని కొత్తవలస విద్యుత్ శాఖ ఏఈ అప్పారావు తెలిపారు. ప్రస్తుతం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా తక్కువగా ఉందని, చోరీకి గురైన వాటి స్థానంలో కొత్తవి వేయడం ఇబ్బందిగా మారుతుందని అంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు.


దేశపాత్రునిపాలెం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి వైరును చోరీ చేసిన దృశ్యం

షిర్డీసాయి బాబాకు స్వర్ణకిరీటంతో అలంకరణ

బొబ్బిలి ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని షిర్డీసాయిబాబా బాబా మందిరంలో జయంతి పురస్కరించుకని బాబాను స్వర్ణకిరీటంతో భక్తులు ఆదివారం అలంకరించారు.మందిరాన్ని పువ్వులతో, విద్యుత్‌దీపాలతో ఆకర్షనీయంగా తీర్చిదిద్దారు.

రెండు ట్రాక్టర్లు స్వాధీనం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బగుడ్డివలస శివారున అక్రమంగా యంత్రంతో ఆదివారం గ్రావెల్ తవ్వుతున్నట్లు సమాచారం మేరకు ఆర్ఐ రాంకుమార్ దాడిచేశారు.ఈమేరకు తరలిస్తుండగా యంత్రంతోపాటు రెండు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్ఐ రాంకుమార్ తెలిపారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పుల్లెల శ్రీనివాసరావు నివాసంలో ఆదివారం నిర్వహించారు. పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు ప్రసాదరావు ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

బొబ్బిలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు.ఆదివారం బొబ్బిలిలో యూటీఎఫ్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు.

లక్షల వ్యయం.. లక్ష్యం దూరం

● అలంకారప్రాయంగా మారిన కుళాయిలు ●కోమటిపల్లిలో పరిస్థితి


కోమటిపల్లిలో దిష్టిబొమ్మల్లా మారిన కుళాయిలు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్‌లో భాగంగాలక్షలాది రూపాయల వ్యయంతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు.ఈకుళాయిలు ఎప్పుడూ సక్రమంగా నీరిచ్చి ప్రభుత్వం ఆశించిన లక్ష్యం చేరలేదు.దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కోమటిపల్లి గ్రామంలో గతఏడాది జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.15 లక్షల వ్యయంతో మంచినీటి కుళాయిలు ఏర్పాటుచేశారు. వీటి నుంచి అసలు నీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో మహిళలు ఇంటికి దూరంగా ఉన్న వీధికుళాయిలు, చేతిపంపుల నుంచి నీరు తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. ప్రభుత్వ నిధులు వెచ్చిస్తున్నా ఎలాంటి ఫలితం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనాఅధికారులు స్పందించి వేసవి కాలంలో కోమటిపల్లికి కుళాయిలద్వారా తాగునీరువచ్చేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణ కుమార్‌ను వివరణ కోరగా.. కుళాయిలు వేసిన సమయంలో నీరు బాగానే వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం ఎందుకు రావడం లేదో పరిశీలిస్తామని తెలిపారు.

విద్యార్థులే వంట మనుషులు

● చదువుకోవలసిన సమయంలో వంట పనులు చేస్తున్నవైనం

భోగాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):భోగాపురంలోని బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులు వంట మనుషులుగా అవతారమెత్తారు. ఆదివారం వేకువజాము 5గంటల సమయంలో చదువుకోవాల్సిన విద్యార్థులు వంట పనిలో నిమగ్నమయ్యారు. కొంతమంది చిన్నారులు గోధుమ పండి కలుపుతూ, మరికొంత మంది ముద్దలుగా చేస్తూ, ఇంకొంత మంది పూరీలు పాముతూ కనిపించారు. ఇలా ప్రతిరోజూ వసతి గృహ సిబ్బంది వేకువ జామున కొంతమంది విద్యార్థులను నిద్రలేపి వారితో వంట పని చేయిస్తున్నారు. ఇక్కడ 50 మంది విద్యార్థుల వరకు ఉంటున్నారు. వసతిగృహానికి భవనం లేకపోవడంతో స్థానిక హైస్కూల్‌లో రెండు గదుల్లో నిర్వహిస్తున్నారు. అలాగే ఇక్కడ సిబ్బంది ఎవరూ ఉండడంలేదు.సంక్షేమ అధికారి, వంటమనిషి, అటెండర్, వాచ్‌మన్‌ఉండాలి. అయితే సంక్షేమ అధికారి ఉన్నా ఇన్‌చార్జి కావడంతో వచ్చి వెళ్లి పోతుంటారు. ఇద్దరు అటెండర్లు ఉన్నా ఒక అటెండర్ వసతి గృహానికి వచ్చి వెళ్లి పోతుంటారు. వంట మనిషి పూర్తిగా లేరు. దీంతో ఇక్కడ విద్యార్థులను పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. దీనిపై బీసీ వసతి గృహం ఇన్‌చార్జి సంక్షేమ అధికారి చరణ్మయిని ఫోన్‌లో వివరణ కోరగా.. వసతి గృహంలో సిబ్బంది తక్కువగా ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని, ఇకనుంచి అలా జరగకుండా చూసుకుంటామని తెలిపారు.


ఆదివారం వేకువ జామున వంట పనిలో నిమగ్నమైన విద్యార్థులు

బిల్లులు కాక.. పనులు సాగక

●రాళ్లుతేలడంతో అగచాట్లు ●ఇదీ కోటశిర్లాం- ఎనుబరువు రోడ్డు దుస్థితి

రామభద్రపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటశిర్లాం నుంచి ఎనుబరువుకు వెళ్లే రహదారి పనులు బిల్లులు కాకపోవడంతో నిలిచిపోయాయి. 2021 ఈ ప్రారంభించిన ఈ రోడ్డు పనులు నాలుగేళ్లు గడుస్తున్నా పూర్తికాపోవడంతో రాళ్లుతేలిన మార్గంలో రాకపోకలు సాగించాల్సివస్తోందని గిరిజనులు వాపోతున్నారు. నాలుగు కిలో మీటర్లు మేర కోటశిర్లాం, జమ్మువలస, జీడికవలస, ఎనుబరువు మీదుగా పనులు పూర్తి చేయాల్సిఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం గుండానే రావివలస పంచాయతీ పరిధిలో గల మధురు గ్రామాలప్రజలు రామభద్రపురం రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు ఇక్కడ ఐదు వేల మంది వరకు జీవిస్తున్నారు. ప్రతి పనికి ఎనిమిది కిలో మీటర్ల దూరంలోని రామభద్రపురం వెళ్లాల్సివస్తోందని రావివలస వాసులు వాపోతున్నారు. రోడ్డంతా రాళ్లుతేలడంతో ఇబ్బందిపడుతున్నామని వాపోతున్నారు.ఈ రోడ్డుపై రెండు లేయర్లు పిక్క వేసి బీటీ వేయకపోవడంతో రాళ్లుతేలిపోయి ప్రయాణానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని గిరిజను లు వాపోతున్నారు. రాళ్లుతేలిన,మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సివస్తోందని రావివలస మాజీ సర్పంచ్ అడారు జయరావు తెలిపారు. నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు గుండా అడవిలో దొరికిన వివిధ ఉత్పత్తులను మైదాన ప్రాంతాలకు తరలించి జీవనోపాధి పొందుతున్నాని గిరిజనులు చెబుతున్నారు. ఎన్నికలముందు రోడ్డు నిర్మాణా నికి హామీలి చ్చిన నేతలు తర్వాత పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు.కాగా బిల్లులు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయని పీఐఈ డీఈ శర్మ తెలిపారు.ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు.


ఎనుబరువు వద్ద రాళ్లు తేలిన రోడ్డు

ఉత్కంఠ

(ఐదో పేజీ తరువాయి)

నాయకులు ఏమాత్రం తీసిపోని రీతిలో ప్రతివ్యూహాలతో సన్నద్ధమయ్యారు. ఇందులో కొంతమేర సానుకూల ఫలితాలను సాధించినట్లు పార్టీ శ్రేణులు సంబరపడుతున్నాయి. ఫారమ్-2 నోటీసు విడుదలయ్యే వరకు రెండు రాజకీయ శిబిరాలు చాలా ఉత్కంఠగా కాలాన్ని వెల్లబుచ్చకతప్పదు. ఇదే అదనుగా కొంతమంది కౌన్సిలర్లు భారీ మొత్తంలో బహుమతులను డిమాండ్ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

సోదరుడి స్నేహితుడే నిందితుడు

(ఐదో పేజీ తరువాయి)

ఆదినారాయణకు చెందిన బ్లూటూత్, ఈయర్‌బడ్స్ పడిపోగా, వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలి చెప్పిన ఆధారాలతో కొద్ది గంటల్లోనే ఆదినారాయణను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. కేసును చాకచక్యంగా చేధించిన చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, ఇన్‌చార్జి సీఐ ఉపేంద్ర, గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు, కానిస్టేబుళ్లు ఆనందరావు, హరిను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సమావేశంలో ఎస్‌బీ ఎస్ఐ కేకే నాయుడు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉడకని అన్నం..పాచిపోయిన కూర

(ఐదో పేజీ తరువాయి)

ఆసుపత్రిలో మెనూకు సంబంధించిన బోర్డు ఏదీ కనిపించలేదు. ప్రత్యేకమైన రూము లాంటిది కూడా లేదు. ఆసుపత్రి వార్డుల ఎంట్రన్స్‌లో చెట్టుకింద నిలబడి భోజనాలను వడ్డిస్తున్నారు. నిర్ణీత సమయానికి మునుపే రోగులకు భోజనాలను వడ్డించారు. రోగులు తమకు కేటాయించిన మంచాలపైనే భోజనాలు చేశారు. అన్నం, రసం, క్యాబేజీ కూర, అరటిపండు, గుడ్లు పంపిణీ చేశారు. శనివారం గుడ్లు ఇవ్వడంతో చాలామంది తీసుకోలేదు.


బొబ్బిలి ఆసుపత్రిలో రోగులకు పంపిణీ చేసేందుకు తెచ్చిన ఆహారపదార్థాలు

ఎస్.కోట ఆస్పత్రిలో..

ఎస్.కోట సామాజిక ఆసుపత్రిలో మధ్యాహ్న భోజనాన్ని సమయానికి రోగులకు అందించడం లేదు. శనివారం మధ్యాహ్నం 12గంటలకు పెట్టాల్సిన భోజనం ఆరోగ్యశ్రీ వార్డులో ఉన్న వారికి ఒంటి గంటకు, సాధారణ వార్డుల్లో ఉన్న వారికి 1.30 గంటకు అందించారు. అరటిపండ్లు చాలా చిన్నవిగా ఉన్నాయి. శనగ ఉండ గోలికాయలా ఉంది. ఇదేనా వీరికి ఇచ్చేది అని భోజనం వడ్డించిన వారిని అడిగితే కాంట్రాక్టర్లు ఏవి పంపితే అవే వడ్డిస్తామని సమాధానం ఇచ్చారు. ఆసుపత్రి వర్గాలు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా వారి జాడ అసలు లేదు. మెనూ ప్రకారం రోజూ ఇడ్లీ పెట్టాల్సి ఉండగా గత వారంరోజులుగా ఉదయం సేమియా ఉప్మా, గోధుమనూక ఉప్మా పెడుతున్నారని రోగులు తెలిపారు. ఆరోగ్యశ్రీ రోగులకు మజ్జిగ ఇస్తున్నారు. జనరల్ వార్డుల్లో ఉన్నవారికి ఇవ్వడం లేదు.

భోజనం రుచిగా లేదు..

నాలుగు రోజుల నుంచి గజపతిగరం ఏరియా ఆస్పత్రిలో ఉన్నాం. రుచీపచీ లేని భోజనం పెడుతున్నారు. నోట్లో పెట్టలేకపోతున్నాం. గత్యంతరం లేక బయట హోటళ్ల నుంచి తెచ్చుకొని తింటున్నాం.రోజుకి సుమారు రూ.300 ఖర్చు అవుతోంది.

-తవటాన రామలక్ష్మి, రోగి సహాయకురాలు,
దత్తి గ్రామం, దత్తిరాజేరు మండలం.

దారుణంగా ఉంది..

నాలుగు రోజులుగా గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో ఉంటున్నాను. ఇక్కడ పెడుతున్న భోజనం, టిఫిన్ చాలా దారుణంగా ఉంది. చెత్తబుట్టలో వేసేస్తున్నాను. ఉడికీ ఉడకని అన్నం, నీళ్లలాంటి సాంబారు అందిస్తున్నారు. గుడ్డు ఇవ్వడంలేదు. టీ గ్లాస్‌తో నీళ్ల లాంటి పాలు ఇస్తున్నారు. అప్పుడప్పుడు హోటల్ నుంచి తెచ్చుకొంటున్నాం. రోజుకి రూ.300 వరకు ఖర్చు అవుతోంది.

-అమ్మన్న, రొంపిల్లి(గ్రామం),
అనంతగిరి మండలం, అల్లూరి జిల్లా